సాక్షి
సూర్యాపేట
గురువారం ၊ 23 ၊ మార్చి ၊ 2023



రంజాన్ మాసం వస్తోంది

ముస్లింల పవిత్ర మాసం వస్తోంది. ఈ నెల 24వ తేదీ నుంచి రంజాన్ నెల ప్రారంభం కానుంది.

- 10లో



'శోభకృత్'కు వినూత్న స్వాగతం

శోభకృత్ నామ సంవత్సరానికి మోత్కూర్ పట్టణ ప్రజలు వినూత్నంగా స్వాగతం పలికారు.

- 10లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33° / 23°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్


మట్టపల్లిలో నిత్యకల్యాణం



గరుడవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మీచెంచు లక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో పంచాంగ శ్రవణం గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు లక్ష్మణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, బ్రహ్మాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆలయంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. తెలుగు సంవత్సరం ఉగాది కావడంతో వేకువజామునే ఆలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన తరువాత మూలవర్యులకు నిజాభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. శ్రీస్వామివారికి విశేషంగా సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవను నిర్వహించి, ఆలయాన్ని మూసివేశారు.

అకాల వర్షం.. స్పిల్‌వే పనులకు ఆటంకం



స్పిల్‌వే దిగువన బకెట్ పోర్షన్ నుంచి నీటిని తోడుతున్న సిబ్బంది

నాగార్జునసాగర్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే పనులకు అకాల వర్షంతో ఆటంకం ఏర్పడింది. స్పిల్‌వే దిగువన గల బకెట్ పోర్షన్‌లో ఉన్న నీటిని మోటార్ల సహాయంతో తోడుతుండగా ఇటీవల వర్షానికి మళ్లీ బకెట్ పోర్షన్ వర్షపు నీటితో నిండింది. మరలా ఆ నీటిని తోడుతున్నారు. సాగర్ ఆనకట్ట పొడవు 15,956 అడుగులు ఉండగా అందులో రాతి కట్టడం 4,756 అడుగులు ఉంది. రేడియల్ క్రస్ట్‌గేట్లకు దిగువ భాగంలో గల స్పిల్‌వే 1,545 అడుగుల పొడవు ఉంది. ప్రాజెక్టు ఎత్తు 590.00 అడుగులు కాగా గేట్లను 546 అడుగుల ఎత్తులో అమర్చారు. 546 అడుగుల ఎత్తు నుంచి 1,545 అడుగుల విస్తీర్ణంలో పడిన వర్షపు నీరంతా దిగువన గల బకెట్ పోర్షన్‌లోకి చేరుతుంది. బకెట్ పోర్షన్ నిండిన అనంతరం అప్రాన్ నుంచి నదిలోకి వెళతాయి. ప్రస్తుతం కుడి కాల్వకు విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా నీరు విడుదలవుతోంది. అందులోనుంచి వచ్చే లీకేజీ నీరుకూడా బకెట్ పోర్షన్‌లోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటి మట్టం 534.00 అడుగులు. మరో నాలుగైదు రోజుల్లో 530.00 అడుగులకు తగ్గే అవకాశం ఉంది. దీంతో విద్యుదుత్పాదన ద్వారా కుడి కాల్వకు విడుదలయ్యే నీటిని తప్పనిసరి పరిస్థితిల్లో నిలుపుదల చేస్తారు.

యాదాద్రి పురోహితుడికి ఉగాది పురస్కారం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రధాన పురోహితుడు గౌరీభట్ల సత్యనారాయణశర్మకు ఉగాది పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

కడుపులో కడతేరుస్తుండ్రు

సూర్యాపేటలో గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు

- ఆడపిల్ల అని తేలితే అబార్షన్
- ఒక్కో అబార్షన్‌కు రూ.20వేల నుంచి రూ.50వేలకుపైగా వసూలు
- ఖమ్మం జిల్లాలోని ఓ వ్యక్తితో కలిసి దందా సాగిస్తున్న ఆర్‌ఎంపీలు
- ఇటీవల 10 మంది అరెస్ట్
- మరికొంత మందిపై పోలీసుల నిఘా



సూర్యాపేట: జిల్లాలో ఆర్‌ఎంపీలు గుట్టుగా గర్భిణులకు అబార్షన్లు చేయిస్తూ దందా సాగిస్తున్నారు. రూ.30వేలు ఇస్తే లింగ నిర్ధారణ పరీక్ష చేసి ఆడపిల్ల అని తేలితే కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల సహాయంతో అబార్షన్ చేయిస్తున్నారు. ఖమ్మం కేంద్రంగా జిల్లాలో సాగుతున్న ఈ దందాను ఇటీవల పోలీసులు బయటపెట్టారు. ఇప్పటికే కొంతమంది ఆర్‌ఎంపీలపై కేసులు నమోదు చేయగా మరికొంత మందిపై నిఘా పెట్టినట్లు సమాచారం.

కొంతమంది ఆర్‌ఎంపీలు గ్రూపుగా ఏర్పడి..

జిల్లాలో ఎక్కువగా ఆర్‌ఎంపీలు అబార్షన్లు చేయిస్తున్నారు. లింగ నిర్ధారణ చేసుకునే వారిలో ఎక్కువగా మగ బిడ్డ కావాలనుకునేవారు ఉంటున్నారు. మొదట ఆడపిల్ల పుట్టాక, మగ సంతానం కోసం లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని కొంతమంది ఆర్‌ఎంపీలు గ్రూపుగా ఏర్పడి ఖమ్మం జిల్లాలోని ఒక వ్యక్తితో కలిసి సూర్యాపేటలోని స్కానింగ్ సెంటర్లు, డాక్టర్లు, మెడికల్ షాప్స్ ద్వారా ఈ దందా నడిపిస్తున్నారు. ఇందులో స్కానింగ్ సెంటర్లు టెస్టులు చేసి ఆడ, మగ వివరాలు చెప్పడం ఒకటైతే.. డాక్టర్లు దొంగచాటున క్లీనిక్‌లో అబార్షన్లు చేయడం మరో అంశం. ఇవేమీ లేకుండా కొంతమంది ఆర్‌ఎంపీలే స్వయంగా ఇంటికి వచ్చి టాబ్లెట్ పద్ధతిలో అబార్షన్ చేస్తున్నారు. ఒక్కో అబార్షన్ కోసం రూ.20వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

17 మంది పేర్లను బయటపెట్టగా..

జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇద్దరు గర్భిణులకు అబార్షన్ చేస్తుండగా డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆస్పత్రిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు ఈ వ్యవహారంలో కీలకపాత్ర ఆర్‌ఎంపీలదే అని తేల్చారు. మొత్తం 17 మంది పేర్లను బయటపెట్టగా వీరిలో 10 మంది ఆర్‌ఎంపీలే ఉండడం గమనార్హం. మరికొన్ని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టిన పోలీసులు మరికొంత మందిని అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల గర్భిణికి అబార్షన్ చేసిన ఆస్పత్రిని సీజ్ చేశాం. స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాం.

– డాక్టర్ కోటాచలం, డీఎంహెచ్‌ఓ

స్కానింగ్ సెంటర్లలో కోడ్ లాంగ్వేజ్..

కొన్ని స్కానింగ్ సెంటర్లలో పుట్టబోయే బిడ్డ మగ, ఆడ అని చెప్పే సమయంలో పట్టుపడకుండా కోడ్ లాంగ్వేజ్‌తో మేనేజ్ చేస్తున్నారు. గర్భిణులు మొదటగా ఆర్‌ఎంపీల వద్దకు రాగానే ఒంటరిగా స్కానింగ్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ లోపలికి వెళ్లే ముందు మొబైల్ తీసుకురానివ్వరు. స్కానింగ్ చేశాక ఆడ పిల్ల అయితే పాప మంచిగా ఉందంటూ, బాబు అయితే అబ్బాయి చాలా ముద్దుగా ఉన్నాడంటూ కోడ్ లాంగ్వేజ్‌లో చెప్తారు. జిల్లా కేంద్రంలోని ఒక స్కానింగ్ సెంటర్, కోదాడ, హుజూర్‌నగర్‌లో ఈ వ్యవహారం గుట్టుగా సాగుతుండగా ఇప్పుడు ఖమ్మం నుంచి టెక్నీషియన్లు, పోర్టబుల్ అల్ట్రా సౌండ్ మిషన్స్ తీసుకొచ్చి ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్కానింగ్ చేస్తున్నారు.



సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు

ప్రజలకు అన్నీ శుభాలు కలగాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, భానుపురి: శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరికీ అన్నీ శుభాలు కలగాలని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. అనంతరం వేద పండితులు పంచాగ శ్రవణం గావించారు. అంతా జయమే కలుగుతుందని తెలిపారు. మంత్రికి కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌లు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేసిన వారికి అందజేశారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, వైద్యశాఖ అధికారులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో, శ్రీవేదాంత భజనమందిరంలో, విద్యానగర్‌లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉగాది పచ్చడి తయారు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

కూలీల హాజరు సులభతరం

- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సీయూజీ సిమ్‌కార్డులు
- తప్పనున్న నెట్‌వర్క్ సమస్య

నాగారం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల హాజరును అంతకు ముందు మస్టర్లలో నమోదు చేసేవారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్ ప్రవేశపెట్టారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఈ హాజరు విధానం కూలీలను ఇబ్బందులకు గురిచేస్తోంది. నిత్యం నెట్‌వర్క్ సమస్యతో కూలీల హాజరు నమోదు కావడం లేదు. రోజంతా శ్రమించే శ్రామికులకు డబ్బులు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ యాప్ వల్ల నష్టపోతున్నామని వారు పలుమార్లు అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ప్రభుత్వం హాజరు నమోదు కోసం జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కొత్తగా సీయూజీ (కామన్ యూజర్ గ్రూప్) సిమ్ కార్డులు అందించాలని నిర్ణయించింది.

నెలకు 30జీబీ వరకు డేటా అందుబాటులో..

కొత్తగా అమలు చేస్తున్న యాప్‌లో నెట్‌వర్క్ సమస్యతో కూలీల హాజరు నమోదులో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్‌లు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కాబట్టి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు చేస్తున్నారు. వర్క్ ఐడీ కింద 20 మంది కూలీలకు మించితే కూలీల గ్రూప్ ఫొటో నమోదు చేయాల్సి ఉండేది. ఇందులో కూడా మార్పులు చేశారు. ప్రస్తుతం ఒక వర్క్ ఐడీ కింద ఒక కూలీ పని చేసినా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా కూలీ హాజరు ముందే నమోదు చేయాలి. అనంతరం నాలుగు గంటల విరామం తర్వాత రెండో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 22,844 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. ఏప్రిల్‌లో వీరి సంఖ్య రోజుకు లక్ష వరకు ఉంటుంది. అలాంటి సమయంలో నమోదు ప్రక్రియ మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకు గాను క్షేత్రసహాయకులకు కామన్ యూజర్ గ్రూప్ సిమ్ కార్డులు అందించనున్నారు. దీనిలో నెలకు 30జీబీ వరకు డేటా అందుబాటులో ఉంటుంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కూలీల వివరాలు

పంచాయతీలు	475
క్షేత్రసహాయకులు	293
జాబ్‌కార్డుల సంఖ్య	2,61,106
జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీల సంఖ్య	6,16, 057
ప్రస్తుతం పనులకు వెళ్తున్న కూలీల సంఖ్య	22,844

సిమ్‌కార్డులు అందజేస్తున్నాం



ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో తలెత్తుతున్న నెట్‌వర్క్ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సీయూజీ సిమ్‌కార్డులను అందజేస్తుంది. ఈ సిమ్ కార్డులను క్షేత్రసహాయకులకు అందజేస్తున్నాం. సర్వర్ సమస్యలో కూలీల హాజరు నమోదు కాకపోతే వారికి పని చేసిన డబ్బులు అందించడం ఇబ్బందికరంగా మారుతుంది. కూలీల హాజరు నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు సీయూజీ సిమ్ కార్డులు అందజేస్తున్నాం.

–కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

గ్రామాల్లో ఐపీపీబీ సేవలు

- రేషన్ దుకాణాల ద్వారా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం
- గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి రానున్న మినీ బ్యాంకు సేవలు
- ఇప్పటికే అవగాహన కల్పించిన అధికారులు
- డీలర్ల సమ్మతి మేరకు దరఖాస్తుల స్వీకరణ

హుజూర్‌నగర్: తపాలా శాఖ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) తమ పౌర సేవలను రేషన్ దుకాణాల ద్వారా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఇందుకోసం ఆసక్తి కలిగిన రేషన్ డీలర్లను బ్యాంక్ లావాదేవీలు జరిపేందుకు బిజినెస్ కరస్పాండెంట్లుగా నియమించుకోనుంది. తపాలా, పౌరసరఫరాల శాఖల ఒప్పందం మేరకు అధికారులు చర్చలు కూడా జరిపారు. ఈమేరకు రేషన్ దుకాణాలు ఇక మినీ బ్యాంకులుగా గ్రామీణ ప్రజలకు సేవలు అందించనున్నాయి. నగదు లావాదేవీలు, వివిధ రకాల బిల్లుల చెల్లింపులు సులువుగా నిర్వహించే సదుపాయం ఉంటుంది. డబ్బులు డ్రా చేసుకునేందుకు, ఇతర ఆన్‌లైన్ సేవల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిఉండదు. ఈ విషయమై తపాలా శాఖ అధికారులు ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లోని పలు మండలాల డీలర్లతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. డీలర్ల సమ్మతి మేరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.



610 రేషన్‌షాపుల్లో..

జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉండగా 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 610 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రభుత్వం ఈ రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ బియ్యంతో పాటు ఇతర సరుకులను చౌకధరలకు పంపిణీ చేస్తుంది. దీంతో పాటు ప్రజలకు బ్యాంక్ సేవలు కూడా అందుబాటులోకి వస్తుండడంతో డీలర్లకు అదనపు ఆదాయంతో కొంత వెసులుబాటు కలగనుంది.

డిజిటల్, నగదు లావాదేవీలు..

రేషన్ డీలర్ల సెల్‌ఫోన్‌లో ఐపీపీబీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. దీనిద్వారా ఒక ఖాతాదారుడికి రోజుకు రూ.10 వేల వరకు నగదు లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం ఉంది. విద్యుత్, నల్లా బిల్లులు, సెల్ ఫోన్ రీచార్జ్, డిష్ బిల్లుల వంటివి చెల్లించే అవకాశం ఉంది. బ్యాంకులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఇలాంటి సేవలు చాలా అవసరం ఉంది. డిజిటల్ ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఇందుకుగాను రేషన్ డీలర్లు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు లావాదేవీలు జరిపితే ప్రతి లావాదేవీకి రూ.6లు కమీషన్ అందజేస్తారు. అదేనెలలో లావాదేవీలు మొత్తం రూ.5 లక్షలు దాటితే కమీషన్ రూ.11 వరకు పెరిగే అవకాశం ఉంది. లావాదేవీలు రూ.3వేల కంటే తక్కువ లావాదేవీలు జరిగితే రూ.6 కంటే తక్కువ కమీషన్ వస్తుంది. డీలర్లు కూడా నెలలో దాదాపు 15 రోజుల పాటు ఖాళీగా ఉంటారు. ఇటువంటి సమయాల్లో మినీ బ్యాంక్ సేవలను ప్రజలకు చేరువగా తీసుకెళ్లే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



రేషన్ షాపుల ద్వారా అందించే బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రజలకు రేషన్ దుకాణాలు అందుబాటులో ఉంటాయి. కనుక గ్రామీణ వినియోగదారులు ప్రతి చిన్న బ్యాంక్ పనికి పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. లావాదేవీలు జరిపినందుకు డీలర్లకు కమీషన్ కూడా అందుతుంది. దీంతో వారికి అదనపు ఆదాయం సమకూరుతుంది.

– శ్రీకళ్యాణ్, సీనియర్ మేనేజర్, ఐపీపీబీ, సూర్యాపేట

ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ జమీల్, పుట్టపాక నర్సింహారావు, షేక్ ఖాజావలి, వారి అనుచరులు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రఘునాథపాలెంలో ప్రతి ఏటా నిర్వహించే శ్రీరామ నవమి ఏర్పాట్లపై గ్రామస్తులతో చర్చించారు. పండుగను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

మైనార్టీ సెల్ గ్రామశాఖ అధ్యక్షుడిగా షేక్ జాన్ బాబా

రఘునాథపాలెం మైనార్టీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా షేక్ జాన్ బాబాను నియమిస్తూ అతనికి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్, టీపీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీ నాయక్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీం, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టి రామచంద్రయ్య, మఠంపల్లి పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, అచ్చయ్య, రవీందర్‌రెడ్డి, నిజాం, వెంకటనారాయణ, పుల్లారెడ్డి, భద్రారెడ్డి, నాగుల్ మీరా, పున్నయ్య, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

శివాలయంలో శ్రీరామనవమి వేడుకలు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలకు ఆచార్యులు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉదయం గణపతి పూజ, స్వస్తీవాచనం, రక్షా బంధనం, పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 30న శ్రీరామకల్యాణం, 31న పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

వసూలైంది 80 శాతమే..

- జిల్లాలో ఇంటి పన్ను వసూలు లక్ష్యం రూ.11.58 కోట్లు
- ఇప్పటివరకు వసూలు చేసింది రూ.9.25కోట్లు
- రావాల్సిన బకాయిలు రూ.2.32కోట్లు
- గ్రామపంచాయతీల్లో పన్నుల వసూలుకు 8రోజులే గడువు

నాగారం: పల్లెల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇవి సకాలంలో వసూలైతే పల్లె ప్రగతి సాధ్యమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ నిధులతో పాటు ఇంటి పన్నులు కీలకంగా మారాయి. ఉన్న వనరులు ఎలాగైనా రాబట్టుకోవాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 8 రోజులే గడువు ఉండగా జిల్లాలో ఇప్పటివరకు 80శాతం పన్నులు వసూలయ్యాయి. గడువు దగ్గర పడుతుండటంతో పన్నుల లక్ష్యం చేరుకునేందుకు అధికారులు ఉరుకులు పరుగులు తీసుకున్నారు. ఇప్పటికే పంచాయతీ సిబ్బంది ఉదయం నుంచే పన్నుల వసూళ్ల కోసం ఇంటింటికీ తిరుగుతున్నారు.



మొత్తం పంచాయతీలు 475

జిల్లాలో 23 మండలాలు ఉండగా, 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు, పన్నేతర చార్జీల రూపంలో జిల్లాలో రూ.11.58 కోట్లు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.9.25కోట్ల పన్నులు వసూలు చేశారు. ఇంకా రూ.2.32 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లాలోని 23 మండలాల్లో 80శాతానికి పైగా పన్నులు వసూలైనట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ఖర్చు ఇలా..

గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు తదితర పనుల నిర్వహణ కోసం పన్నుల రూపంలో వచ్చిన నిధులను ఖర్చు చేస్తారు. పల్లె ప్రగతి పనుల నిర్వహణ, ట్రాక్టర్, వాటర్ ట్యాంక్ నిర్వహణతో పాటు మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలను ఇచ్చేందుకే ప్రభుత్వం కేటాయించే నిధులు సరిపోతున్నాయి. పంచాయతీలకు ట్యాక్స్‌ల రూపంలో వచ్చే ఆదాయం చిన్న, చిన్న పనుల నిర్వహణకు వినియోగించే అవకాశం ఏర్పడుతుంది. వంద శాతం పన్నులు వసూలయ్యేలా కృషి చేసి, గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించే బాధ్యత క్షేత్రస్థాయి అధికారులపై ఉంది. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

కార్యదర్శులపై భారం..

పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఉదయం ఏడింటికే వచ్చి పారిశుద్ధ్యం, నీటి సరఫరా చూస్తున్నారు. వీటికి తోడు పన్నులు వసూళ్ల లక్ష్యం ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం ఉండట్లేదు. ప్రతి రోజు పంచాయతీ డిమాండ్‌లో 5 శాతం మేర పన్నులు కచ్చితంగా వసూలు చేయాలనే ఆదేశాలు ఉండటంతో... కార్యదర్శులు, కారోబార్లు కలిసి పన్ను వసూళ్లను వేగంగా చేస్తున్నారు.

లక్ష్యం పూర్తిచేస్తాం



నెలాఖరులోగా 100 శాతం పన్నుల లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇప్పటివరకు జిల్లాలో 80 శాతం పన్నులు వసూలయ్యాయి. గడువులోగా పన్నులు వసూలు చేసేలా ఇప్పటికే పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఎప్పటికప్పుడు పన్నుల సేకరణ వివరాలను నమోదు చేస్తున్నాం. ప్రజలు కార్యదర్శులకు సహకరించి గ్రామాల అభివృద్ధికి పన్నులు సకాలంలో చెల్లించాలి.

– సాంబిరెడ్డి, డీఎల్‌పీఓ, సూర్యాపేట

క్లుప్తంగా

30గొర్రెల అపహరణ

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామ శివారులో మంగళవారం రాత్రి గొర్రెల మంద నుంచి 30గొర్రెలను అపహరించుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండమడుగు గ్రామానికి చెందిన కడెం సత్తయ్య గొర్రెల మందలోని గొర్రెలను అర్ధ రాత్రి తరువాత గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గొర్రెలను చోరీ చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేయాలని మండల గొర్రెల పెంపకదారుల సంఘం అధ్యక్షుడు సోము రమేష్ డిమాండ్ చేశారు.

ఆరుగురు రేషన్ డీలర్లపై కేసు

గుర్రంపోడ్: మండలంలో నకిలీ రేషన్ కార్డులు సృష్టించి లబ్ధిదారులు కార్డులు తీసుకోకుంటే వచ్చే నెల నుంచి ఉచిత రేషన్ సరుకులు రావని భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా అంటగట్టిన 6గురు రేషన్ డీలర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలిపారు. మండలంలోని కొప్పోలు, లక్ష్మీదేవిగూడెం, కోయగూరోనిబావి, వెంకటాపురం, చామలోనిబావి, ఆములూరు, చామలేడు, ఊట్లపల్లి, తేనేపల్లి, జూనూతల, చేపూర్ గ్రామాల రేషన్ డీలర్లు ప్రభుత్వ అనుమతి లేకుండా నకిలీ రేషన్ కార్డులు సృష్టించారు. ఒక్కొక్క కార్డుకు రూ.200ల చొప్పున లబ్ధిదారులకు బలవంతంగా అంటగట్టినట్లు బాధితులు తహసీల్దార్ ఇంద్రవల్లి హుస్సేన్‌కు మొరపెట్టుకున్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం పట్టివేత



దొండపాటు గ్రామస్తులు పట్టుకున్న మద్యం కాటన్లు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గ్రామస్తులు పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని దొండపాడులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం వైన్స్ నుంచి దొండపాడు వైన్స్‌కు ముద్రలు లేకుండా తరలిస్తున్న 5 కాటన్ల మద్యాన్ని గ్రామస్తులు పట్టుకుని ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ నాగార్జున రెడ్డిని సంప్రదించగా సిబ్బందిని పంపించామన్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామీణ కళలను ఆదరించాలి

చౌటుప్పల్ : అంతరించిపోతున్న గ్రామీణ కళలను ప్రతి ఒక్కరూ ఆదరించి పూర్వవైభవం తేవాలని, ఈ బాధ్యతను యువత తీసుకోవాలని ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సూచించారు. గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి అష్టమ వార్షికోత్సవం బుధవారం రాత్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుతో కలిసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు అలరించారు. అనంతరం జరిగిన సభలో విఠలాచార్య మాట్లాడారు. గ్రామాల్లో కళల పరిరక్షణ కోసం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. గ్రామీణ కళారూపాల ద్వారా పురాణాలు నేటి యువతకు తెలుస్తాయన్నారు. సేవా సమితి మండల అధ్యక్షుడు పోలోజు శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు సుర్కంటి వెంకట్‌రెడ్డి, చిక్క నరసింహ, ఎరుకల మల్లేశం, వీసం చంద్రారెడ్డి , బాలరాజు, రామరాజు, యాట వెంకటేశం, చిట్టిప్రోలు వెంకటేశం, కిష్టయ్య, దొడ్డి రాములు, సందగళ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రైతులను బలిగొన్న కరెంట్

- మిర్యాలగూడ, నకిరేకల్ మండలాల పరిధిలో ఘటనలు
- పండుగ పూట విషాదం

మిర్యాలగూడ టౌన్ : వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ముగ్గురు రైతులు మృతిచెందారు. పండుగ పూట మిర్యాలగూడ, నకిరేకల్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామానికి చెందిన గుడిపాటి నాగయ్య(43) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామ శివారులో కొంత వ్యవసాయ భూమి ఉంది. రోజు మాదిరిగానే నాగయ్య పొలానికి నీరు పెట్టేందుకు బుధవారం వెళ్లాడు. మోటారుకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో పొలం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. దానికి మరమ్మతులు చేసేందుకు ఆఫ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే పొలంలో పడిపోయాడు. సమీప రైతులు గమనించి అక్కడికి చేరుకునేలోపే మృతిచెందాడు. సమాచారం మేరకు రూరల్ ఎస్‌ఐ నర్సింహులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.



నకిరేకల్ : సత్తయ్య మృతదేహం



మిర్యాలగూటౌన్ : ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

మంగపల్లిలో..

నకిరేకల్ : నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన పున్నమిరాజు సత్తయ్య(51) తన వ్యవసాయ బావి వద్ద మోటార్ వైర్ సరిచేసేందుకు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లైన్ ఆఫ్ చేసేందుకు వెళ్లాడు. ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు అతడిని నకిరేకల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే సత్తయ్య మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడుకి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పండుగపూట మృతిచెందడంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

విహారం.. విషాదాంతం

- సాగర్ వెనుకజలాల్లో మునిగి యువకుడి మృతి

దేవరకొండ(చందంపేట): ముగ్గురు మిత్రుల విహారయాత్ర చివరకు విషాదాంతమైంది. కృష్ణమ్మ అందాలను చూసేందుకు వచ్చిన మిత్రుల బృందంలో ఓ సభ్యుడు సాగర్ వెనుకజలాల్లో మునిగి మృతిచెందాడు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ తుర్కయాంజాల్‌కు చెందిన గొని శివకుమార్(32) అక్కడే ఎస్‌బీఐ బ్యాంకులో ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నాడు. బుధవారం పండుగ సెలవు కావడంతో బ్యాంకు సిబ్బంది, మరో ఇద్దరు మిత్రులతో కలిసి కారులో నేరేడుగొమ్ము మండల పరిధిలోని వైజాగ్ కాలనీకి వచ్చారు. ఈ సందర్భంగా బోటులో మిత్రులతో కలసి శివకుమార్ షికారు చేశాడు. అనంతరం నీటిలో ఈతకు దిగి నీట మునిగాడు. శివకుమార్ ఎంతకూ నీటి నుంచి బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన మిత్రులు స్థానిక మత్స్యకారులు, పోలీసులకు సమాచారం అందించారు.అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ రాజు మత్స్యకారుల సహకారంతో నీట మునిగిన శివకుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతుడి బాబాయి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.



శివకుమార్

ఆత్మహత్యా..? ప్రమాదమా..?

- రైల్వేట్రాక్ పక్కన అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి
- భువనగిరి పట్టణంలో ఘటన

భువనగిరి : రైలు పట్టాల పక్కన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీనగర్‌కు చెందిన చొల్లేటి గిరిబాబు (47) ఘట్కేసర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కాగా, గిరిబాబు కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. మూడు రోజులుగా పూటుగా మద్యం తాగుతూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవపడి మంగళవారం రాత్రి 11గంటల సమయంలో ఇంటినుంచి బయటికి వెళ్లాడు. తెల్లారేసరికి సోమేశ్వర గోదాము మైలురాయి నంబర్ 239/7–9 వద్ద రైల్వే పట్టాల పక్కన తీవ్ర గాయాలతో మృతిచెంది ఉన్నాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. అతడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే, గిరిబాబు మద్యం మత్తులో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడా..? లేదా పట్టాలు దాటుతున్నప్పుడు గుర్తుతెలియని రైలు ఢీకొట్టిందా? అని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయకుమార్ ఈనెల 21న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి చౌటుప్పల్‌కి వెళ్లారు. గమనించిన దండగులు తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 13 తులాల బంగారాన్ని చోరీ చేశారు. ఇరుగు పొరుగు వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

బొమ్మలరామారం : కారు అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగినేనిపల్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. టీఎస్30జి 2990 నంబరు గల కారు బొమ్మలరామారం నుంచి బీబీనగర్ వైపు వెళ్తుతుండగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ ఘనటలో కారులో ప్రయాణిస్తున్న దంపతులతో పాటు ఓ చిన్నారికి గాయాలైనట్లు తెలిసింది. బీబీనగర్ మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన వ్యక్తులకు చెందిన వాహనంగా భావిస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ వెంకన్నను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



ఘటనాస్థలంలో బోల్తా కొట్టిన కారు

గురుకుల విద్యార్థి యశ్వంత్‌కు కన్నీటి వీడ్కోలు





శాలిలింగోటంలో యశ్వంత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మందుల సామేల్

శాలిగౌరారం: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ప్రభుత్వ బీసీ గురుకుల పాఠశాల(జ్యోతిరావుపూలే రెసిడెన్షిల్ పాఠశాల)లో ఈనెల 16న నీటిసంపు గోడ కూలిన ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందిన శాలిలింగోటంకు చెందిన కొప్పుల యశ్వంత్(10)కు బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత యశ్వంత్ మృతదేహం అంబులెన్స్‌లో గ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. బుధవారం ఉదయం యశ్వంత్ మృతదేహాన్ని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ నవీన్‌కుమార్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరంగ యశ్వంత్ తల్లిదండ్రులు కొప్పుల శ్రీను, సత్యవతిలను ఓదార్చారు. యశ్వంత్ అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నివాళులర్పించిన నాయకులు

యశ్వంత్ మృతదేహానికి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటింబీకులను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. నివాళులు అర్పించినవారిలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్, కాంగ్రెస్‌పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు ఇటికాల చిరంజీవి, నాయకులు అయితగోని వెంకన్న, అన్నెబోయిన సుధాకర్, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు పాక మౌనిక, పాక రాములు, నాయకులు పాక యాదయ్య, చెవుగాని అశోక్, సైదులు, శ్రీను, తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్‌పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు చిరంజీవి బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థికసాయాన్ని అందించారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

చౌటుప్పల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. చౌటుప్పల్, శాలిగౌరారం మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఆల్ఫా ఏజెన్సీ ద్వారా పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న పట్టణ కేంద్రానికి చెందిన గుడ్డేటి పారిజాత, స్థానికంగానే నివాసం ఉంటున్న పంతంగికి చెందిన బోయ లలితలు తెల్లవారుజామున 10వ వార్డులో విధులకు హాజరయ్యేందుకుగాను ఇంటి నుంచి బయలుదేరారు. బయోమెట్రిక్ హాజరు వేసుకునేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్తున్నారు. ఆ క్రమంలో బస్టాండు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో పారిజాతకు తలకు బలమైన గాయాలవ్వడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. లలితకు కాలు విరగడంతో చికిత్స నిమిత్తం కటికపల్లికి తీసుకెళ్లారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదానికి గురైతే అధికారులు ఎవరూ పట్టించుకోలేదని పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారకుడైన వ్యక్తి బైకు వదిలి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన మాద రాకేశ్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉగాది పండుగ కోసమని ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి మోత్కూరు, భైరవునిబండ మీదుగా అడ్లూరుకు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో మండలంలోని తిరుమలరాయునిగూడెం గ్రామానికి చెందిన పడాల భరత్ మండలకేంద్రం నుంచి తిరుమలరాయునిగూడెంకు వెళ్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాకేశ్, భరత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను 108 వాహనంలో నకిరేకల్‌కు తరలించగా వైద్యుల సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గూడూరు, హీరోయిన్ అనుశ్రీత్రిపాఠి

బీబీనగర్ : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బిజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. బీబీనగర్ మండలం గూడూరు పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద రహదారికి ఇరువైపులా జీఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చల్లని మినరల్ వాటర్ చలి వేంద్రాలను బుధవారం ఆయన సినీ హీరోయిన్ అనుశ్రీ త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. ప్రతి వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్, మండల అధ్యక్షుడు జంగారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు వినయ్, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

చౌటుప్పల్ : పట్టణంలో పాలకూర్ల శివయ్య స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీమదాంధ్ర మహాభారత అవతరణ సహస్రాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. పద్య కంఠస్థ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానికంగా అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకుగాను వైద్యంలో డాక్టర్ ప్రియాంక, సాహిత్యంలో బడుగు శ్రీరాములు, విద్యలో శివరంజనికి ఉత్తమ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పాలకూర్ల మురళి తదితరులు ఉన్నారు.



వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు, బహుమతులు పొందిన విద్యార్థులు

పండుగకు వెళ్తూ పరలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో కుమారుడి దుర్మరణం, తండ్రికి గాయాలు
- యాదగిరిగుట్ట మండల పరిధిలో ఘటన

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. హైదరాబాద్–వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై యాదాద్రి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌బాద్ జిల్లా నర్సింహులాపేటకు చెందిన దంపతులు అజ్మీర వెంకన్న, కళ హైదరాబాద్‌లో కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని స్వస్థలమైన మహబూబ్‌బాద్ జిల్లాకు వెళ్లేందుకు వెంకన్న భార్యను హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కించాడు. అనంతరం వెంకన్న తన కుమారుడు సేమ్యాతో కలిసి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం గ్రామం స్టేజీ పరిధిలోనికి రాగానే కల్వర్టును అతి వేగంతో ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న అజ్మీర సేమ్యా (22) అక్కడికక్కడే మృతిచెందాడు. అజ్మీరా వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.



ఘటనాస్థలిలో అజ్మీర సేమ్యా నాయక్ మృతదేహం

ఉరేసుకుని వృద్ధుడి బలవన్మరణం

తుంగతుర్తి: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని దేవునిగుట్టతండాలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... మండల పరిధిలోని దేవునిగుట్టతండాకు చెందిన బానోతు ఠాక్రా (60) కొన్ని రోజులుగా కుటుంబంలో ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. దీంతో ఠాక్రా మనస్తాపనికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసికొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య బానోతూ పూలమ్మ వ్యవసాయ బావి నుంచి ఇంటికి వచ్చి చూడగా ఠాక్రా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని కన్పించాడు. ఇరుగుపొరుగు వారి సహాయంతో ఠాక్రాను కిందకి దించగా అప్పటికి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ డానియేల్‌కుమార్ తెలిపారు.



బానోతు ఠాక్రా మృతదేహం



దేవునిగుట్టతండాలో విచారణ చేస్తున్న పోలీసులు

పరిహారం చెల్లించే వరకూ దీక్ష

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న లప్పానాయక్‌తండా వాసులు పరిహారం, ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్ష బుధవారం ఏడో రోజు కొనసాగింది. నిర్వాసితులు వంటావార్పు నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని టెంట్ కిందనే పచ్చడి చేసుకొని సేవించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోతున్నామని, మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు పరిహారం చెల్లించడం లేదని, పునరావాసం కల్పిస్తలేరని పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. రిజర్వాయర్ వద్ద ఏడు రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారుల్లో స్పందన లేదని వాపోయారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పెండింగ్ వ్యవసాయ భూముల నష్ట పరిహారాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించే వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంక్యా నాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

- వేరుశనగ సాగులో చీడపీడల నివారణపై పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ సలహాలు

పాడి పంట



సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర

పెద్దవూర: ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రైతులు ఆరుతడి పంటగా అధిక విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. ఉష్ణోగ్రతలలో మార్పులు వస్తుండటంతో సాగులో చీడపీడలు, పోషకలోపాలు తలెత్తున్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ తెలుపుతున్నారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు ఎరువులు, మందులు వాడితే లాభాల బాట పట్టవచ్చునని చెబుతున్నారు.

పచ్చపురుగు బెడద..

రబీలో శనగపచ్చ పురుగు బెడద అధికంగా ఉంటుంది. మార్చి నెల వరకు ఈ పురుగుల ఉధృతి ఉంటుంది. ఆకుల వెనక రెక్కలు పాలిపోయిన తెలుపు రంగుతో నల్లని అంచు కలిగి ఉంటాయి. గుడ్లు లేదా దాని నుంచి వెలువడిన పిల్ల పురుగులు లేదా ఆకుపచ్చ రంగులో పెరిగిన పురుగులు ముదురు ఆకుపచ్చ రంగు నుంచి గోధుమ రంగులోకి మారతాయి. నల్లని తల ఉన్న చిన్న పురుగులు హరితాన్ని పువ్వు మొగ్గలు, రేకులను గీకి తింటాయి. తర్వాత మొగ్గలు, పువ్వులు కాయలను తొలిచి తిని డొల్ల చేస్తాయి. ఒకే పురుగు చాలా కాయలను నష్ట పరుస్తుంది. వేరుశనగ పంట లేతగా ఉన్నప్పుడు ఇవి ఆకులను తిని నాశనం చేస్తాయి. కాయలకు గుండ్రటి రంధ్రాలు చేసి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఈ పురుగును నివారించవచ్చు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. గుడ్లు, చిన్న పురుగుల నివారణకు ఐదు శాతం వేపనూనెను పంటకు పిచికారీ చేయాలి. ఎన్‌పీవీ ద్రావణాన్ని(వైరస్ ద్రావణం) ఎకరానికి 250 ఎల్‌ఈ తగినంత నీటిలో కలిపి సాయంత్రం పిచికారీ చేయాలి.



పెద్దవూరలో సాగవుతున్న వేరుశనగ

ఆకుపచ్చ తెగులు..

పంట వేసిన 30రోజుల నుంచి ఈ తెగులు కనిపిస్తుంది. ఆకు పైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. తెగులు కన్పించిన వెంటనే ఎకరాకు 400 గ్రాముల మాంకోజెబ్ లేదా హెక్సాకొనాజోల్ 400 మిల్లీలీటర్లు లేదా కార్బన్‌డిజమ్ 200 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వేరుశనగలో సూక్ష్మ పోషకాలు..

వేరుశనగ మొక్కల పెరుగుదలకు 16రకాల పోషక పదార్థాలు అవసరం. వీటిలో ముఖ్యమైన పోషకాలైన క్యాల్షియం, సల్ఫర్, జింక్, ఇనుము వేరుశనగ పంటకు చాలా అవసరం. ఇవి మొక్కలకు తగినంత అందనప్పుడు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

క్యాల్షియం..

మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే ఎంజైములను ఉత్తేజ పరచడానికని వేర్ల అభివృద్ధికి బాగా తోడ్పడుతుంది. తాలు కాయలు ఏర్పడకుండా గింజలు లావుగా ఉండి కాయ నాణ్యత పెరిగేందుకు దోహదం చేస్తుంది. వేరు చివరి భాగం నశించి పెరుగుదల ఆగిపోతుంది. ఆకుల్లో పచ్చదనం లోపిస్తుంది. ఆకుల కాండం విరుగుతుంది. కంచు రంగుకు మారి చిగుర్లు వంకరలు తిరుగుతాయి. వేర్ల అభివృద్ధి దెబ్బతిని బుడిపెల సంఖ్య తగ్గుతుంది. కాల్షియం లోప నివారణకు ఎకరాకు 200 కిలోల జిప్సమ్‌ను తొలి పూత దశలో అంటే విత్తిన 40 రోజులకు మొక్క మొదళ్ల దగ్గరికి ఎగదోయాలి. జిప్సం వేసిన తరువాత నీరు పెట్టాలి.

గంధకం..

గంధకం నూనె శాతం పెరగడానికి కాయలు మంచి రంగును కలిగి ఉండేందుకు కాయ గింజబరువు పెరగడానికి దోహదపడుతుంది. నేల నుంచి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను ఎక్కువ పరిమాణంలో మొక్క తీసుకోవడానికి గంధకం దోహదం చేస్తుంది. ఊడల నుంచి కాయలు తెగిపోకుండా కాపాడుతుంది. వేర్లలో రైజోబియం బుడిపెలు ఏర్పడడానికి సహకరిస్తుంది. గంధకం లోపిస్తే కొత్త ఆకులలో లోప లక్షణాలు కనిపిస్తాయి. ఆకుల ఈనెలు పసుపు రంగుకు, లేత ఆకులు పసుపు పచ్చగా మారతాయి. ముదురు ఆకులు మార్పు లేకుండా ఆకుపచ్చగా ఉంటాయి. వీని నివారణకు అమ్మోనియం సల్ఫేట్, సూపర్ పాస్ఫేట్, పొటాషియం సల్ఫేట్ వంటి ఎరువులు వాడాలి. గింజల్లో నూనె శాతం పెరగడానికి విత్తిన 40రోజులకు జిప్సం వాడాలి.

ఇనుము..

ఈ పోషకం లోపించినప్పుడు ఆకులు పసుపు పచ్చగా మారతాయి. తర్వాత ఆకు మొత్తం పసుపు రంగుకు మారుతుంది. లేత ఆకులు సన్నగా, నిటారుగా పసుపు రంగుకు మారి పసుపు రంగు కోల్పోయి, తెలుపు రంగుకు మారతాయి. ముదురు ఆకులు ఎండి రాలిపోతాయి. ఇనుము లోపం వలన కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. పంట ఎదుగుదల ఆగిపోయి దిగుబడి 30–40 శాతం తగ్గుతుంది. వీని నివారణకు ఐదు గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక గ్రాము సిట్రిక్ ఆమ్లం కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ద్రావణాన్ని ఎప్పటికప్పుడు కలుపుకుంటూ పిచికారీ చేయాల్సి ఉంటుంది.